క్లుప్తంగా

వడదెబ్బతో యువకుడు మృతి


షేక్ అమాన్ (ఫైల్)

బోథ్: బోథ్ మండల కేంద్రానికి చెందిన షేక్ అమాన్ (18) వడదెబ్బతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. అమాన్ మూడు రోజులుగా ఎండలో క్రికెట్ ఆడుతున్నాడు. మంగళవారం మైదానంలో క్రికెట్ ఆడుతుండగా వాంతులు చేసుకున్నాడు. వెంటనే స్నేహితులు, కుటుంబసభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

'పేదలకు అండగా ఉంటా'


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: నిరుపేదలకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన నందే నందినికి మంజూరైన రూ.43 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, నాయకులు నర్వాడే రమేశ్, నజీర్, రాజు, భరత్ తదితరులు ఉన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి

నేరడిగొండ: టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతుందని, వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాంకిడి గ్రామంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన ఉండాలన్నారు. మరణాల రేటు తగ్గించడంతోపాటు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. హైరిస్క్ ఉన్న వారందరికీ పరీక్షలతోపాటు వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ భీంరాజ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన కస్తూరి లింగన్న మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అక్కడికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు.

యాజమాన్య పద్ధతిలో పంట సాగుచేయాలి

సాత్నాల: యాజమాన్య పద్ధతిలో పంటలు సాగు చేసుకోవాలని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బోరజ్ మండలం సిర్సన గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు ఖర్చు, రసాయనిక ఎరువుల మోతాదు తగ్గించుకోవాలన్నారు. షాపుల్లో విత్తనాలు, మందుల కొనుగోలు చేసేటప్పుడు బిల్లుల రసీదు తీసుకోవాలన్నారు. డాక్టర్ మోహన్‌దాస్, వెటర్నరీ డాక్టర్ సిద్ధార్థ్, అగ్రికల్చర్ హెచ్‌ఓ అలేఖ్య, ఏఈవో దీప్తి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి


భీంపూర్: రైతులు తమ పొలాల్లో రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మంజులత, అనిత తెలిపారు. మండలంలోని దనోర రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు ప్రతిఏటా తమ పొలాలలో పంట మార్పిడి చేసి అధిక ఆదాయం పొందాలన్నారు. ఏఈవో విశాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

సిరికొండ: ఆధార్ తరహాలో రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట రైతుకు 11 అంకెల నంబర్ కేటాయించనుంది. ఇందులో భాగంగా పంటల వివరాల నమోదు కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సిరికొండ క్లస్టర్ ఏఈవో ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సిరికొండ, కొండపూర్, రాంపూర్ శివారంలోని రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

జీవో ఇచ్చారు..అమలు మరిచారు

- బోథ్ సీహెచ్‌సీని వంద పడకల ఏరియా ఆసుపత్రిగా..
- అప్‌గ్రేడ్ చేసిన గత బీఆర్ఎస్ సర్కారు
- మౌలిక వసతులకు రూ.17.50 కోట్లు కేటాయింపు
- ప్రస్తుతం ఆ జీవో అమలుపై సందేహాలు


వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మారుస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో


వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు వివరిస్తున్న మాజీ జెడ్పీటీసీ, ఆసుపత్రి సూపరింటెండెంట్

బోథ్: అసలే అభివృద్ధిలో బోథ్ నియోజకవర్గ కేంద్రం వెనుకంజలో ఉంది. నియోజకవర్గంలో ఉండాల్సిన కార్యాలయాలు, వసతులు లేవు. ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి జెడ్పీటీసీగా ఉన్న సంధ్యారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్ పలుమార్లు అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించగా, బోథ్ సీహెచ్‌సీ నూతన భవనానికి అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10.50 కోట్లు మంజూరు చేసింది. తర్వాత కొన్నిరోజులకు సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మార్చింది. ఇందుకు సంబంధించి జీవో సైతం విడుదల చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను అమలు చేస్తుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి.

వంద పడకల ఏరియా ఆసుపత్రిగా

నియోజకవర్గ కేంద్రంలో గల సీహెచ్‌సీని జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి వైద్యవిధాన పరిషత్‌లోకి మార్చారు. కొన్నిరోజుల అనంతరం వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మారుస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవోను జారీ చేసింది. స్పెషలిస్ట్ వైద్యులు, అన్ని సౌకర్యాలు, ఫర్నిచర్, ఇతర సామగ్రి కోసం రూ.17.50 కోట్లు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు జీవోను అమలు చేయడం లేదు. దీంతో బోథ్ సీహెచ్‌సీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవోను అమలు చేస్తే బోథ్ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన అవసరం ఉండదు. స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారు. స్కానింగ్‌తోపాటు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం పట్టించుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రిని అభివృద్ధి చేయాలి



అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి బోథ్ సీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.10.50 కోట్లు ఇవ్వాలని ఆయన్ను ఒప్పించి నిధులు మంజూరు చేయించుకున్నాం. మళ్లీ సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మారుస్తూ జీవో జారీ చేశారు. నియోజకవర్గ ప్రజలు సంతోషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను అమలు చేసి ఆ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి.

– సంధ్యారాణి, మాజీ జెడ్పీటీసీ, బోథ్



బోర్డు సరే..క్రీడా సౌకర్యాలేవి?

సాత్నాల: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతలో క్రీడా నైపుణ్యం పెంపొందించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. ఒక్కో ప్రాంగణానికి రూ.50 వేల నిధులు వెచ్చించింది. కానీ కొత్తగా ఏర్పడిన భోరజ్ మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణమని బోర్డు మాత్రమే ఏర్పాటు చేసినా అధికారులు అందులో సౌకర్యాలు కల్పించడాన్ని విస్మరించారు. ఇది చూసిన ప్రతి ఒక్కరూ ఇదేమి క్రీడా ప్రాంగణమంటూ విస్మయాన్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

ఐటీడీఏలో అపరిశుభ్రత





ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో అపరిశుభ్రత దర్శనమిస్తోంది. ఐటీడీఏ ద్వారం ముందర ఇలా గుట్కాలు తిని ఉమ్మి వేసినవి, తలుపులకు బూజుపట్టి దర్శనమిస్తున్నాయి. ఐటీడీఏలో ఉన్నతాధికారులు విధులు నిర్వర్తిస్తున్నప్పటికి పరిశుభ్రతపై దృష్టిసారించడం లేదా ? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ అసమర్థతతోనే రైతు ఆత్మహత్యలు

- మాజీమంత్రి జోగు రామన్న


పరామర్శిస్తున్న జోగు రామన్న

సాత్నాల: రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వ అసమర్థతే కారణమని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. మండలంలోని సుందరిగి గ్రామానికి చెందిన కౌలు రైతు కొక్కుల లచ్చన్న కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. సదరు రైతుకు ఉన్న అప్పుల వివరాలపై ఆరా తీశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు అందకపోవడం రైతుని తీవ్రంగా కలిచివేసిందని, దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ నర్సింగ్‌తోపాటు దేవన్న, పోచ్చన్న, కిష్టన్న, సంతోష్, పోతన్న, మునఫ్, కుమ్ర రాజు, ఉగ్గే విట్టల్ ఉన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో యువకులతో కాంగ్రెస్ నాయకులు

బేల: మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించిందని, అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఏఎస్ గార్డెన్‌లో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల యువకులు, వయోజనులు 75మంది రక్తదానం చేశారు. పార్టీ బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ రాందాస్, మాజీ ఎంపీపీ బాపురావు, నాయకులు వామన్, రూప్‌రావు, శంకర్, అవినాష్, చంద్రకాంత్, రాజు, కరీం, మోబిన్, కిషన్ పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న టి.లచ్చిరాం

ఆదిలాబాద్: వ్యాయామ ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోర్సు కోఆర్డినేటర్ టి.లచ్చిరాం కోరారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు అందజేయనున్న శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలని ఉద్దేశంతో వారికి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీఈటీలు స్వామి, రాజేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'కక్షసాధింపు చర్యలు మానుకోవాలి'

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారుతి డొంగ్రె అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలు మరిచిన అధికార పార్టీ నాయకులు, 17 నెలల క్రితం జరిగిన ఘటనపై ఇప్పుడు కేసు నమోదు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో జాన్సన్‌నాయక్‌పై పెరుగుతున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నేతలు కక్ష సాధింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజాద్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, నాయకులు షేక్ సుఫియన్, మడావి భీంరావ్, జాదవ్ లఖన్, ధరిణి ధన్‌రాజ్, శివాజీ సర్కేలే, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఓర్వలేక తప్పుడు కేసులు

సిరికొండ: అధికార పార్టీ నాయకులు రాజకీయంగా ఓర్వలేకనే బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌పై తప్పుడు కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తప్పుడు కేసులపై ఖండించారు. నాయకులు పెంటన్న, విజయ్, సునీల్, రాజన్న, లక్ష్మణ్, లస్మన్న, గంగన్న, రాజు, సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతూ అధికార పార్టీ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌పై కేసులు పెట్టడం సరికాదని, ముందు అధికార పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ధరణి రాజేశ్, భరత్, సురేశ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి చెట్టు కిందపడి ఉండడంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి శరీరంపై ఎరుపు రంగు షర్టు, బూడిద రంగు నైట్ ప్యాంట్ ఉందని పేర్కొన్నారు. ఫిట్స్ రావడం లేక వడదెబ్బతో మృతిచెంది ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తుపడితే సెల్ 8712659920 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

న్యాయపరిపాలన శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: బీసీ సంక్షేమశాఖ ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను అందించే న్యాయ పరిపాలన శిక్షణకు అర్హులైన న్యాయవాదుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. 39 ఏళ్లలోపు వయస్సు ఉండి, బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగి ఉండాలని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించకుండా ఉన్న బీసీ న్యాయవాదులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పశువుల సంత తాత్కాలిక మూసివేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న పశువుల సంత తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి గజానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి మే 10 వరకు సంత మూసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. పశువులను సంతకు తీసుకురావద్దని సూచించారు.

ఎంపీడీవోకు సన్మానం



గంగాసింగ్‌ను సన్మానిస్తున్న నాగోరావు, మడావి రూప్‌దేవ్

నార్నూర్: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గంగాసింగ్‌ను మంగళవారం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఖండేవ్ ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, మాజీ సర్పంచ్ మడావి రూప్‌దేవ్ సన్మానించారు. ఎంపీవో సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

జొన్న కొనుగోళ్లు నిలిపివేత

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లను ఈనెల 21 నుంచి 23వ తేదీల్లో నిలిపివేస్తున్నట్లు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి కేశవ్ తెలిపారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి మార్కెట్‌కు పంట తీసుకురావద్దని సూచించారు. మార్కెట్‌లో ఉన్న పంటను వర్షానికి తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పాలని పేర్కొన్నారు.

ఖాళీబిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు రోడ్డెక్కారు. మంగళవారం ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నిరోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తాగునీటి సమస్య పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు


తాంసి: హాజరైన ఉపాధ్యాయులు


ఉట్నూర్‌రూరల్: మాట్లాడుతున్న ఎంఈవో ఆశన్న

భీంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదవడం, రాయడం, సాధారణ గణిత ప్రక్రియలపై పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎంఈవో శ్యాంసుందర్ తెలిపారు. మండలంలోని పిప్పల్‌కోటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులు నిర్వహించే ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పదాలు గుర్తించడం, వాటిని అర్థం చేసుకోవడం, సరళమైన గణిత భావనలను నేర్చుకోవడం వంటి విషయాలు వివరించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశ్ యాదవ్, తిరుపతి, ప్రభాకర్, ఉపేందర్, అశోక్, రిసోర్స్‌పర్సన్లు సప్తగిరి, జయశరథి, రాజు, శ్రీనివాస్, లక్ష్మి, సీఆర్పీలు రవీందర్, చిరంజీవి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల శిక్షణలో భాగంగా ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు మంగళవారం ఎంఈవో శ్రీకాంత్ ప్రారంభించారు. వివిధ సబ్జెక్ట్‌ల ఎంఆర్పీలు శ్రీనివాస్, సుధాకర్, పోచ్చన్న, గంభీర్‌లు ఉపాధ్యాయులకు ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత పెంపొందించాలని ఎంఈవో రాపెల్లి ఆశన్న సూచించారు. మండలంలోని లక్కారం జెడ్పీ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్లు రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఉదారాం, బాదు, రవికుమార్, రవీందర్, సుధాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన


భీంపూర్: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

భీంపూర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. కార్మికుల పని భారాన్ని తగ్గించి, కనీస వేతన చట్టం ద్వారా రూ.26 వేలు చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు గంగుబాయి, సుజాత, నజీమా తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఏకమై కలిసికట్టుగా పోరాటం చేయాలని అంగన్‌వాడీ మండల యూనియన్ అధ్యక్షురాలు సుభద్రబాయి, కార్యదర్శి పెంటుబాయి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే


వెన్నెలతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణను కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం పలు అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అనుమతి లేని ధర్నాలకు టెంట్ ఇవ్వొద్దు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అనుమతి లేకుండా నిర్వహించే ధర్నాలకు అద్దెకు టెంట్ ఇవ్వొద్దని టూ టౌ న్ సీఐ కరుణాకర్ రావు ఓ ప్రకటనలో తెలి పా రు. అనుమతి పత్రం చూపిస్తేనే అద్దెకు టెంట్ ఇవ్వాలని, లేకపోతే టెంట్ నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.